

బీసీ బాలుర హాస్టల్‌లో కిచెన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బీసీ బాలుర హాస్టల్‌లో
సదుపాయాల కల్పనకు కృషి : ఎమ్మెల్యే కాలేరు

గోల్నాక, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గోవింద్‌నగర్‌లో ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం హాస్టల్ గదులు, కిచెన్, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హాస్టల్‌ను సందర్శించినట్లు ఆయన తెలిపారు. త్వరలో కలెక్టర్‌ను కలిసి హాస్టల్ విషయమై చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎస్. ప్రవీణ్‌కుమార్, కిరణ్, వార్డెన్ రాములు తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌నగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న విద్యార్థుల రాజకీయ పార్టీ నేతలు

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల రాజకీయ పార్టీ నాయకులు అశోక్‌నగర్ చౌరస్తాలో ధర్నా, ఆందోళన, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం దిగి వచ్చేదాకా పోరాటాన్ని కొనసాగిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను విస్తృతం చేస్తామని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు యెచ్చు సునీల్ హెచ్చరించారు. నిరుద్యోగుల డిమాండ్లపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళా అధ్యక్షురాలు సాత్వికరెడ్డి, లీగల్ సెల్ చైర్మన్ పాత నవీన్‌బాబు, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు అనిల్‌గుకీకర్, ప్రధానకార్యదర్శి సాయిమహేష్, యాకుత్‌పురా ఇన్‌చార్జి ఎన్. అనిల్‌కుమార్, ఎల్బీనగర్ ఇన్‌చార్జి కె. అనికేత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలి : టీడీపీ

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న లక్ష ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర ప్రధానకార్యదర్శి నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ పావనికి వినతిపత్రం అందజేస్తున్న సాయికృప అపార్ట్‌మెంట్ వీధి వాసులు

సివరేజీ సమస్య పరిష్కారానికి కృషి

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ సాయికృప అపార్ట్‌మెంట్ వీధిలో సివరేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ అన్నారు. డ్రైనేజీలు పొంగి రోడ్లపై మురుగు నీరు పారుతుండడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జలమండలి ఉన్నతాధికారులతో మాట్లాడి కొత్త పైప్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, బీజేపీ నాయకులు హర్షయాదవ్, నరేందర్, సంపత్‌యాదవ్ పాల్గొన్నారు.

'ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి'

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఆర్టీసీ ఉద్యోగులు పనిచేయాలని హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్ సూచించారు. మంగళవారం ముషీరాబాద్ డిపోలో ఉద్యోగుల కోసం ఏర్పాటుచేసిన శిక్షణ కేంద్రాన్ని, విశ్రాంతి గదిని ఆయన ప్రారంభించారు. ప్రతి డిపోలో ఉద్యోగుల కోసం విశ్రాంతి గది ఏర్పాటు చేయడానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ టి. కిషన్‌రావు, ఏఎం కల్యాణి, ఏఎంఎఫ్ శివరాజ్ అధికారులు జ్యోతిక తదితరులు పాల్గొన్నారు.

'గంగపుత్రుల సమస్యలను పరిష్కరించాలి'

కవాడిగూడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంకకు విజ్ఞప్తి చేశారు. మత్స్య శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రియాంకను తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు గూడబోయిన శివరత్నం, నేతలు భగవాన్, మల్లేష్, యువజన విభాగం అధ్యక్షుడు ఏఎల్ అంబటి సుధాకర్ మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి గడప శంకర్, మహిళా అధ్యక్షురాలు ఆర్ స్వర్ణలత, ఉపాధ్యక్షులు భారతి, వారాసిగూడ, సీతాఫల్‌మండి, కుమ్మరి గూడ మత్స్యకార సొసైటీ నేతలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్.. ఇంట్లోని సామగ్రి దగ్ధం

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి కాలిపోయింది. కృష్ణానగర్‌లో నివసిస్తున్న మల్లేష్ ఇంట్లో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సుమారు రూ. 2 లక్షల విలువైన ఆస్తి నష్టం జరినట్లు సమాచారం. విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర సామగ్రి, ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్రవాహనం కాలిపోయాయి. సమాచారం అందుకున్న కార్పొరేటర్ రవిచారి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మూసీ పరీవాహకంలో సోషియో ఎకనామిక్ సర్వే

రాజేంద్రనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఉస్మాన్‌సాగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గౌరెల్లి వరకు మూసీ పరీవాహకంలో ఉన్న నివాస ప్రాంతాల గురించి సోషియో ఎకనామిక్ సర్వే చేస్తున్నట్లు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ మాలతీ తెలిపారు. ప్రాజెక్టు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమీతోపాటు పలువురు అధికారులు మంగళవారం సర్వే పనులను పరిశీలించారు. మూసీకి ఇరువైపుల 50 మీటర్ల పరిధిలో ఉన్న నివాస సముదాయాల సర్వే చేస్తున్నామన్నారు. 50 మీటర్ల లోపు ఎన్ని నివాసాలున్నాయి? ఏఏ నిర్మాణాలున్నాయి? తెలుసుకుంటున్నామని వారు చెప్పారు. కార్యక్రమంలో జీఏడీ ఎస్టేట్ ఆఫీసర్ చంద్రకళ, రాజేంద్రనగర్ తహసీల్దార్ బి.రాములు పాల్గొన్నారు.

గీతంలో ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు

పటాన్‌చెరు రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్), అకాడమీ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్(ఏహెచ్‌ఏ) సంయుక్త సహకారంతో ఈ కోర్సును ప్రారంభించినట్లు కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఐబీ. రాజు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. కోర్సు వ్యవధి రెండేళ్లు అని, 2024-25 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు గీతం వెబ్‌సైట్ ద్వారా అప్లైచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం గీతం వెబ్‌సైట్ లేదా 9494656677 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ముషీరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. మంగళవారం కళాధర్‌నగర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా, మహంకాళి జిల్లా ఉపాధ్యక్షుడు వాసు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ మొక్కలు నాటి మాట్లాడారు. కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో తమ తమ ప్రాంతాల్లో మొక్కలు నాటాలని కోరారు. ముషీరాబాద్ డివిజన్‌లో బస్తీలు, కాలనీల్లో మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



తల్లి సత్తెమ్మ చేతుల మీదుగా మొక్క నాటిస్తున్న పూస రాజు

బీజేపీ కార్యకర్తలు మొక్కలు నాటాలి

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయకార్యవర్గ సభ్యుడు పూసరాజు పిలుపునిచ్చారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం జెమినీ కాలనీలో తన తల్లి సత్తెమ్మ చేతుల మీదుగా మామిడి మొక్క నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ కార్యకర్తలు మొక్కలు నాటాలని సూచించారు. కాలుష్య నివారణకు మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్‌ల అధ్యక్షులు కలకోట అరుణ్, ఆర్. నరేష్, బద్రినారాయణ, ఎంసీ మహేందర్‌బాబు, రవి, నాయకులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

సీసీ రోడ్డుపై గుంతలు

● నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు

బర్కత్‌పుర, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నింబోలిఅడ్డ నుంచి చప్పల్ బజార్ వరకు నిర్మించిన సీసీ రోడ్డు పనులలో నాణ్యత లోపించిందని, గుంతలతో రోడ్డు నిర్మించడం వల్ల వర్షం నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆరోపించారు. మంగళవారం సీసీ రోడ్డును పరిశీలించి జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా సీసీ రోడ్డును నిర్మించాడని, రోడ్డుపై గుంతలు ఉండడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హెచ్చరించారు.

కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు సుభాష్ పటేల్, ఆర్. సంతోష్, వాసు, బాలప్రసాద్, సూరి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై గుంతను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

సామాజిక సేవలో ముందంజలో ఆర్యవైశ్యులు

ముషీరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందంజలో ఉన్నారని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ భవనంలో ఐవీఎఫ్ అభ్యున్నతికి విశేష సేవలు అందిస్తున్న ఇంటర్నేషనల్ అడ్వైజరీ కమిటీ బోర్డు చైర్మన్ గంజి రాజమౌళి గుప్తాను సన్మానించారు. శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. రాజమౌళిగుప్తా క్రమశిక్షణ, సేవకు మారుపేరని ప్రశంసించారు. పేద వైశ్యుల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషిచేస్తున్నారని అన్నారు. గంజి రాజమౌళి గుప్తా మాట్లాడుతూ.. నిస్వార్థంగా పనిచేసే వారికి మంచి పేరు వస్తుందన్నారు. ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వైశ్య విద్యార్థులకు ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కలిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ మహిళా విభాగం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి నారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సత్తయ్య, కృష్ణమూర్తి, రాజశేఖర్‌గుప్తా, సుధాకర్ గుప్తా, ఉప్పల స్వప్న, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గంజి రాజమౌళి గుప్తాను సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు

నిరుద్యోగుల డిమాండ్ల సాధనకు
టీఎస్‌పీఎస్సీని ముట్టడిద్దాం

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల డిమాండ్ల సాధనకు టీఎస్‌పీఎస్సీని 20 లక్షల మందితో త్వరలో ముట్టడిద్దామని విద్యార్థినేత మోతీలాల్‌నాయక్ పిలుపునిచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతిపత్రాలివ్వడం, ప్లకార్డులు ప్రదర్శించడంతో ప్రభుత్వం దిగిరాదన్నారు. గాంధీ ఆస్పత్రిలో 9 రోజులపాటు ఆమరణదీక్ష చేపట్టి విరమించిన అనంతరం ఆయన మంగళవారం చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర గ్రంథాలయానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడి కార్యాచరణ ప్రకటించారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరాహారదీక్ష చేపడితే ప్రభుత్వం నుంచి ఎవరూ రాలేదన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పి దీక్షను విరమింపజేసే ప్రయత్నం చేశారని, జీవో విడుదల చేయాలని తాను చెప్పానన్నారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ లైబ్రరీకి చేరుకుని మోతీలాల్‌నాయక్‌ను పరామర్శించారు.



మోతీలాల్‌నాయక్‌తో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్

నీట్ పరీక్షను రద్దుచేసి..
సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షను రద్దుచేసి, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. నీట్‌పరీక్ష నిర్వహించిన ఏజెన్సీని రద్దు చేయాలని, ప్రశ్నాపత్రాల లీకేజీలకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశంపై ఇప్పటివరకు ప్రధాని మోదీ నోరు విప్పకపోవడం దుర్మార్గమైనచర్య అని అన్నారు. సీబీఐ దర్యాప్తు పేరుతో ఈ అంశాన్ని మరుగున పడేసే ప్రయత్నాలను ప్రధాని మోదీ చేస్తున్నారని ఆరోపించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పోరాటం చేస్తుందన్నారు.



అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, విద్యార్థి సంఘాల నాయకులు

రేపు విద్యాసంస్థల బంద్

నీట్‌పరీక్ష పత్రం లీకేజీ ఘటనలో కేంద్రంలోని బీజేపీ నేతల హస్తం ఉందని, అందుకే ప్రధాని మోదీ నోరు విప్పడం లేదని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. నీట్‌పై జాతీయస్థాయిలో ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈనెల 4న ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. సమావేశంలో డాక్టర్ విజయ్‌భాస్కర్, విద్యార్థి సంఘాల నాయకులు తాటికొండ విక్రమ్ గౌడ్, అరుణ్, ఆజాద్, నర్సింహనాయక్, లక్ష్మణ్, శాంతికుమార్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్ టేకింగ్ ఇస్తే లోపాలన్నీ సరి..!

● ఇంజనీరింగ్ కాలేజీల అఫిలియేషన్లకు జేఎన్‌టీయూ లైన్ క్లియర్

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ రేపటి నుంచి ప్రారంభం కానుండడంతో, త్వరితగతిన అఫిలియేషన్ ప్రక్రియ పూర్తిచేసే పనిలో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. డెఫిషియన్సీ ఉన్న కళాశాలల యాజమాన్యాలు అండర్ టేకింగ్ ఇస్తే సరిపోతుందంటూ.. సోమవారం రాత్రి వర్సిటీ రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేశారు. ఆరునెలల్లోగా తమ కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ కొరతను అధిగమిస్తామని, లేని పక్షంలో జేఎన్టీయూ అధికారులు చర్యలు చేపట్టవచ్చనే విధంగా రూపొందించిన ఫార్మాట్‌ను సర్క్యులర్‌కు జతచేశారు.

బాండ్ పేపర్లపై అండర్‌టేకింగ్

రూ. 100 బాండ్‌పేపర్‌పై కళాశాల చైర్మన్, సెక్రటరీల సంతకాలతో మంగళవారం సాయంత్రం 4 గంటల్లోగా అండర్‌టేకింగ్ పత్రాలను సమర్పించాలని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు ఆగమేఘాల మీద యూనివర్సిటీకి వచ్చి అండర్‌టేకింగ్ పత్రాలు సమర్పించారు. వర్సిటీ అధికారులు పేర్కొన్న లోపాలను అండర్‌టేకింగ్‌లో ప్రస్తావించకుండా, కొన్ని కాలేజీల యాజమాన్యాలు తమకు ఫ్యాకల్టీ కొరత అంతగా లేదంటూ సమర్పించిన అఫిడవిట్లను జేఎన్‌టీయూ అధికారులు తిరస్కరించారు. మొత్తంగా 139 కాలేజీల్లో 122 కాలేజీలకు అఫిలియేషన్ మార్గం సుగమం అయినట్లు తెలిసింది. మరో 17 కాలేజీలు సవరించిన అండర్‌టేకింగ్ పత్రాలు సమర్పించేందుకు బుధవారం వరకు గడువు కోరినట్లు తెలిసింది.

ఈ ఏడాదికి సీఎస్‌ఈ సీట్ల పెంపు లేనట్లే!

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్‌ఈ) కోర్సుల్లో సీట్ల పెంపులేనట్లేనని జేఎన్టీయూ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, డిమాండ్ ఉన్న సీఎస్‌ఈ కోర్సుల్లో దాదాపు అన్ని కళాశాలలు ఈ ఏడాది పెద్దమొత్తంలో సీట్ల పెంపునకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్నాయి. కాగా, ఇటీవల జేఎన్‌టీయూ నిర్వహించిన ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీల్లో ఆయా కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ కొరత స్పష్టంగా వెల్లడి కావడంతో సీట్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం విముఖత చూపుతున్నట్లు సమాచారం. మరోవైపు కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లైన సివిల్, మెకానికల్ కోర్సుల్లో సీట్లను తగ్గించుకున్న కాలేజీలు, అదే సంఖ్యలో సీఎస్‌ఈ సీట్లను పెంచాలని చేసిన విజ్ఞప్తిని కూడా విద్యాశాఖ ఉన్నతాధికారులు తోసిపుచ్చినట్లు తెలిసింది. దీంతో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో గతేడాది ఎన్ని సీట్లు ఉన్నాయో, ఈ విద్యా సంవత్సరం కూడా అదే ఇన్‌టేక్‌తో కౌన్సెలింగ్‌కు వెళ్లక తప్పదని కాలేజీల యాజమాన్యాల సంఘం ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.